# నీతి తప్పిన బిజెపి

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా తిరిగి కళ్యాణ సింగ్‌ను పట్టాభిషిక్తుడ్ని చేయాలని నిర్ణయించడం ద్వారా బిజెపి అగ్రనేతలు రాజకీయాలలో నీతికి కొత్త భాష్యం చెప్పబోతున్నారు. కళ్యాణ సింగ్‌పై క్రిమినల్ నేరారోపణతో ఛార్జిషీటు దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది; అయోధ్య మసీదు కూల్చివేత కుట్రలో సింగ్ ప్రధాన భూమిక నిర్వహించాడని న్యాయస్థానం నిర్ధారించింది; సిబిఐ దర్యాప్తులో ప్రాథమిక సాక్ష్యాధారాలు రుజువైనట్లు తేల్చి చెప్పింది. ఈ ఛార్జిషీటు దాఖలయ్యేది, కేసు విచారణ జరగబోయేది ఉత్తర ప్రదేశ్‌లో! అదే రాష్ట్రానికి కళ్యాణ సింగ్ ఇప్పుడు ప్రభుత్వాధినేత కానున్నాడు. ఆ నీతిమాలిన పనికి పాల్పడడానికి అద్వాని, వాజ్‌పాయి వంటి అగ్రనేతలు ఏ మాత్రం సిగ్గు పడడం లేదు.

ఉత్తర ప్రదేశ్ రాజకీయాలలో సిగ్గన్నది ఏ కోశానా లేకుండా ప్రవర్తించడం వారికి అలవాటై పోయిందనడం నిజం. అది ఏ కొంచెం వుండి వుండినా బిఎస్‌పితో వారు కలిసి కాపురం చేయలేరు. రాజకీయ, ఆర్థిక, సామాజిక విధానాలు, సిద్ధాంతాలు, ఆలోచనా ధోరణులలో ఈ రెండు పార్టీలూ రెండు ఎదురెదురు ధృవాలు. వర్గపరంగా చూసినా – సమాజంలో అణగారిన దళిత వర్గానికి బిఎస్‌పి ప్రతీక అయితే, బ్రాహ్మణాది అగ్రవర్ణాలకు బిజెపి ప్రతినిధి. గ్రామస్థాయి నుంచి ఈ రెండు వర్గాల వారికి ఈ రెండు పార్టీల కార్యకర్తలకు నిత్య సంఘర్షణ సర్వసాధారణం. అయోధ్యలో రామాలయ నిర్మాణం బిజెపి ధ్యేయమైతే – బిఎస్‌పి అందుకు వ్యతిరేకం. పరస్పర విరుద్ధ శక్తుల మధ్య రాజకీయ పొత్తు ఎంత హేయమైన విషయమో చెప్పశక్యం కాదు. కేవలం అవకాశవాదంతో, అధికార దాహంతో అభిప్రాయాలను అణచుకొని, మనసు చంపుకొని, సిద్ధాంతాలు ప్రక్కన పెట్టి పదవీ తాయిలం నంజుకొంటున్నారు వీరు.

ఆ అవకాశవాదమే ఇప్పుడు కళ్యాణ సింగ్‌ను గద్దెపై కూర్చోబెడుతున్నది. కోర్టులలో ఛార్జిషీటు దాఖలైన రాజకీయ వాదులెవరూ పదవులలో కొనసాగ కూడదన్నది సాంప్రదాయం. దాన్ననుసరించే అద్వాని పార్లమెంట్‌కు దూరంగా వుండిపోయాడు. బీహార్ ముఖ్యమంత్రిగా లల్లూ ప్రసాద్ యాదవ్ రాజీనామా చేసేంత వరకు బిజెపితో సహా అన్ని పార్టీలూ రచ్చ చేశాయి. కాని తమ దాకా వచ్చేసరికి ఆ సాంప్రదాయం కన్పడడం లేదిప్పుడు.

లల్లూ ప్రసాద్ వలె కళ్యాణ సింగ్ అవినీతికి పాల్పడలేదని; అయోధ్య కుట్ర కేసులో అనైతికత ఏదీ లేదు కాబట్టి ఛార్జిషీటును పట్టించు కోనవసరం లేదని ఒక వితండ వాదం విన్పిస్తున్నారు అద్వానీ! అది నిజంగా వితండ వాదమే. క్రిమినల్ చర్యలకు పాల్పడ్డాడన్న ఆరోపణలున్న వ్యక్తిని ప్రభుత్వాధి నేతగా కూర్చోబెడితే – ఏ పోలీసధికారి ఆయనపై సాక్ష్యాధారాలు సేకరించి, కోర్టుకు సమర్పిస్తాడు? ఏ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిందితుడి దోషాన్ని రుజువు చేయను వాదన చేయ గలుగుతాడు? సమాజంలో శాంతిని భగ్నం చేయడానికి కుట్ర పన్నినట్లు నింద వున్న వ్యక్తికి, అదే సమాజంలో శాంతి భద్రతలు కాపాడవలసిన బాధ్యత అప్పచెప్పడం కంటె హేయమైన విషయం వేరొకటి వుందా? లల్లూ యాదవ్, సుఖ్‌రాం వంటి వారి అవినీతి దేశానికి ఎంత చేటు చేస్తున్నదో; కళ్యాణ సింగ్ వంటి వారి మతోన్మాదం అంత కంటె అధికంగా కీడు కల్గిస్తున్న దనడం నిజం.

బిజెపిలో నాయకులకు, కార్యకర్తలకు కరువు లేదు; ముఖ్యమంత్రిత్వం నెరపగల సామర్థ్యం కల్గిన వారు ఇంకెవ్వరూ లేరన్నట్లు కళ్యాణ సింగ్‌ను గద్దె నెక్కించ డానికి అంతగా అంతరాత్మను చంపుకోవడం ఎందుకో అర్థం కాని విషయం. రాజకీయాలలో సత్సాంప్రదాయాలు పాటించాలని వేదికలెక్కి ఉపన్యాసాలు దంచే పెద్దలు – కోర్టులో కేసు పరిష్కార మయ్యేవరకు ఓపిక పట్టి వుంటె ఎంతో బాగుండేది. కాని వారికా ఓపికలేని సంగతి మాయవతితో జరిపిన బేరసారాలలోనే స్పష్టమై పోయింది. ఆమె ఎన్ని షరతులు పెట్టినా, ఎన్ని ఆంక్షలు విధించినా అన్నిటికీ తలలూపి జీహుజూర్ అని పదవి స్వీకరించ బోతున్నారు. పార్లమెంట్‌కు ఏ క్షణంలోనైనా మధ్యంతర ఎన్నికలు జరుగుతాయన్న వాతావరణం ఏర్పడి వుంది కాబట్టి, ఎన్నికల సమయానికి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తమ చేతిలో వుంటె గెలుపు సులభం అవుతుందన్న ఆశతోనే బిజెపి నేతలు ఇన్ని రకాలుగా దిగజారి వ్యవహరిస్తున్నారని భావించాలి. 85 లోక్‌సభ స్థానాలున్న ఉత్తర ప్రదేశ్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఎంతటి ప్రాధాన్యం వుంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే నువ్వొకందుకు పోస్తె నేనొకందుకు త్రాగుతున్నా నన్నట్లు బిఎస్‌పి ఈ రోజు బిజెపిని ప్రభుత్వంలో నిలపవచ్చు కాని – ఎన్నికలంటూ వచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి వుండడం సంభవమా? ఎట్టి పరిస్థితులలోనూ అది జరగను కాక జరగదు. అనాటికి ఇద్దరూ వేరో ప్రక్క వేరి తన్నుకోక తప్పదు. కాన్షీరాం తత్వం తెలిసిన వారెవరైనా అది సులభంగా వూహించ గలరు.

అవకాశ వాదంతో, అధికార దాహంతో, అరాచక తత్వంతో రాజకీయాలను భ్రష్టు పట్టించడానికి ప్రతి పార్టీ ఇట్లా పోటీలు పడి ప్రవర్తిస్తూ పోతే ముందు ముందు దేశం ఏమి కావాలి? ఈ హేయమైన పరిస్థితులలో ప్రజాస్వామ్యం బ్రతికి బట్టగట్టడం సాధ్యమా? ప్రజలలో రాజకీయాల పట్ల, రాజకీయ నాయకుల పట్ల విశ్వాసం నిలుస్తుందా?

ఏ వుద్దేశ్యంతో చేస్తున్నప్పటికి వాజ్‌పేయి, అద్వానీలు ఉత్తర ప్రదేశ్ పీఠాన్ని కళ్యాణ సింగ్‌కు అప్పచెప్పడం ద్వారా రాజకీయాలను మరీ నైచ్యానికి దిగజార్చేస్తున్నారు. ఇప్పటికైనా తమ తప్పు తెలుసుకొని కోర్టులో కేసు తేలేవరకు కళ్యాణ సింగ్‌ను దూరంగా పెట్టడం సమంజసం.

## 50 ఏళ్ళ క్రితం ఈ వారం

19.9.47

పేజీలు:12 వెల:0-2-0

### హైదరాబాద్‌లో కిరాతకత్వం

హైదరాబాద్ జైల్లలో రాజకీయ ఖైదీల విషయంలో ప్రభుత్వం నాజీ పద్ధతులను అవలంబిస్తున్నది. సత్యాగ్రహులను తిండిపెట్టక మాడ్చడం, చీకటి కొట్లలో బేడీలు తగిలించి బంధించడం మొదలైన కిరాతక చర్యలు పరిపాటి అయిపోయినవి.

హైదరాబాద్ సంస్థానం కాంగ్రెస్ ఉద్యమాన్ని గ్రామాలలో వ్యాపించకుండా అరికట్టడానికి నైజాం పోలీసులు మరొక ఎత్తువేశారు. గ్రామాలలో కాంగ్రెస్ ఉద్యమాన్ని కొనసాగనివ్వమని గ్రామోద్యోగుల నుంచి లిఖితపూర్వక హామీలు తీసుకొనబడుచున్నవి. సత్యాగ్రహిని పోలీసులు అరెస్టు చేసి వీధులగుండా లాక్కెళ్లి చచ్చేవరకు కొట్టారు. ఈ దారుణ చర్య "కలకత్తా చీకటి గది" దురంతాన్ని జ్ఞప్తికి తేకమానదు.

హుజూరాబాద్ పర్కాల తాలూకాలలోని గ్రామాల నుండి హృదయ విదారకమైన వార్తలు వస్తున్నవి. పోలీసులు, అరబ్బులు, ముస్లిం గూండాలు కనివిని ఎరుగని రాక్షస చర్యలు జరుపుతున్నారు.

### మద్రాసుకు శరణార్థుల రాక

చెన్నపట్టణానికి పంజాబ్ తదితర ప్రాంతాల నుండి అర్తులు కొందరు వచ్చారు. ప్రస్తుతం ఉత్తర భారతంలో చెలరేగుతున్న మత విద్వేష ప్రచారాన్ని ఎదుర్కొనడానికి శాంతి, సామరస్యాల ప్రాశస్త్యం విషయమై, అన్యులపట్ల సద్భావ పూర్వక వర్తనలోని విశిష్టత విషయమై తీవ్ర ప్రచారం సాగించడమే మార్గం కాగలదనీ, పంజాబ్ నుంచి వస్తున్న కాందిశీకుల సహాయార్థం తీసుకోవలసిన చర్యను గురించి సమాలోచించే నిమిత్తం మద్రాసు షరీఫ్ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు అధ్యక్షత వహిస్తూ ప్రధాని శ్రీ ఓమండూరు రామస్వామి రెడ్డియార్ గారు నగర వాసులకు వినతిచేశారు.

శరణార్థుల సహాయార్థం ప్రధాని విరాళాల కొరకు విజ్ఞప్తి చెయ్యగా అప్పటికప్పుడే మొత్తం రు. 38,654లు వసూలైంది ఇంకా హెచ్చంగా విరాళాలను పోగుచేసే నిమిత్తం పలుకుబడిగల 32 మంది పెద్దలతో ఒక సహాయ సంఘాన్ని ఏర్పాటు చేశారు.

### క్రమశిక్షణ చర్య

మునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులతో పోటీపడుతునందుకు బెజవాడ, కాకినాడ,

కొరవ 8 పేజీలో

# దయానాకు, మదర్‌కు పోలికా?

## జనవాణి

ప్రపంచంలో రాచరిక వ్యవస్థ ఇంకా వెలగబెడుతున్న దేశంగా బ్రిటన్‌ను చెప్పుకోవచ్చు. అక్కడి అంతఃపురమైన బకింగ్ హామ్ ప్యాలెస్‌లో ఎన్ని లోపాలున్నా యవరాణి, యువరాణే అవుతుంది. యువరాణి డయానా తాను చేసిన తప్పులన్నింటికి తన భర్త ఛార్లెస్ కారకుడని నిందించింది. సెక్స్ సంబంధిత విషయాల్లో ఆమె తన భర్త వలనే మొగుల్లను మార్చింది. ఆ తప్పులు కప్పి పెట్టుకొను దీన జనసేవ అనే బోర్డు తగిలించుకోవడంతో చాలా మంది ఆమెను ఆకాశానికి ఎత్తి పారేస్తున్నారు. కొందరు డయానాను మదర్ థెరిసాతో పోల్చి చెప్పడం బాగోలేదు. రాజా తలిస్తే దెబ్బలకు కొదవా అని, డబ్బున్న దేశాల పత్రికలు తలచుకొంటె ఏ రకమైన ప్రచారమైనా చేయగలవని డయానా మరణ విషయంలో నిరూపిత మయ్యింది. డయానా ప్రపంచం శ్లాఘించే ఔన్నత్యం గల స్త్రీ కానే కాదు.

నెల్లూరు వాస్తు రామచంద్ర

### ఛార్జీలు పెంచడం అన్యాయం

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు ఛార్జీలు పెంచడం అన్యాయం. కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా పెంచిన డీజిల్ ధరలను సాకుగా చూపి ఛార్జీలను అపరిమితంగా పెంచడం సమంజసంగాలేదు. ఇదే విధంగా బస్సు ఛార్జీలను పెంచుకొంటూ పోతే రాబోయే రోజుల్లో పేద, మధ్య తరగతి ప్రజానీకానికి ఎడ్లు, గుర్రపు బండ్లలో తిరగక తప్పదేమో. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నులు పెంచడానికి, సామాన్యులే గుర్తుకు వస్తున్నారు. డబ్బున్న వారి జోలికి మాత్రం ఈ ప్రభుత్వం పొరపాటున కూడా పోవడం లేదు.

నెల్లూరు బి. స్వర్ణలతారెడ్డి

### ప్రభుత్వం వెనక్కు తగ్గకూడదు!

గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికో లీగల్ కేసులు చూసే అధికారాన్ని అక్కడి డాక్టర్లకు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ బాగుంది. ఇంతకు మునుపు తాలూకా, జిల్లా ప్రధాన కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో మాత్రమే ఇటువంటి కేసులు చూసేవారు. ఏదైనా ప్రమాదాలు సంభవించి అత్యవసర పరిస్థితుల్లో మారుమూల గ్రామాల నుంచి బాధితులు ఈ కేంద్రాలకు చేరే సరికి ప్రాణాలు కోల్పోయేవారు. తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఈ జీఓ ఎంతగానో ఉపయోగపడుతుంది. కాని డాక్టర్లు ఈ జీవోను రద్దు చేయమని కోరడం విడ్డూరంగా ఉంది. దీనికి ప్రధాన కారణం గ్రామాల్లో డాక్టర్లు నివాసముండక పోవడమే అని భావించాలి. ప్రభుత్వం ఈ విషయమై వెనక్కు తగ్గకుండా ఖచ్చితంగా ఈ జీఓను అమలుచేయాలి.

నెల్లూరు కె. శ్రీనివాసరావు

### రాష్ట్రంలో కరువు పరిస్థితి

కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించిన సమస్యలు నానాటికి జటిలమై పోతున్నాయి. కర్నాటక ప్రభుత్వం ఇప్పటికే కృష్ణానదిపై అల్మట్టి, అప్పర్ తుంగ డ్యామ్

కొరవ 8 పేజీలో


## ఇల్లు అమ్మబడును

నెల్లూరు టౌన్, తిప్పరాజువారి వీధి, శివప్రియ లాడ్జి ప్రక్క సందులో 15 అంకణాల రెండంతస్తుల కట్టుబడి కల్గిన అన్ని వసతులు గల ఇల్లు అమ్మబడును. వివరాలకు సంప్రదించండి (ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల మధ్య)

ఎ.వి. సీతారామయ్య

డోర్ నం.17/79, తిప్పరాజువారి వీధి, శివప్రియ లాడ్జి ప్రక్కన సందు, మల్లికార్జున ఫైనాన్స్ ప్రక్కన, నెల్లూరు-1

# జవహర్ భారతి - అవినీతి భారతిగా మారిపోయింది!



నెల్లూరు నీటిపారుదల శాఖ కార్యాలయంలో చెదలు పట్టిన ఫైళ్లు లాగి చూపుతున్న ఆ శాఖమంత్రి టి. గోపాలకృష్ణా రెడ్డి.

గత మెంతో ఘనమైన కావలి జవహర్ భారతి కళాశాల, నేడు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి మూలంగా అవినీతి భారతిగా తయారైంది. కాలేజీలో ప్రతి చిన్న పనికి విద్యార్థులు ఆఫీసు సిబ్బంది చేయి తడపాల్సిన దుస్థితి దాపురించింది. కాలేజీలో డిగ్రీ కోర్సుల అడ్మిషన్లను, కూడా మెరిట్‌తో పని లేకుండా డబ్బు తీసుకొని పూర్తి చేశారంటే పరిస్థిత ఎంత విషమించిందో అర్థం చేసుకోవచ్చు. టెంపరరీ ఉద్యోగులను ఏళ్ల తరబడి పర్మినెంటు చేయక పోవడంతో, వాళ్లు కాలేజీలో పలురకాల అవినీతికి కర్తలవుతున్నారు. సిబ్బంది రెండు వర్గాలుగా చీలి పోవడంతో అనేక సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. డిగ్రీలో సైన్సు గ్రూపు సీటుకు 5 వేల రూపాయల రేటు పెట్టి విక్రయించారు కాలేజీ సూపరింటెండెంట్ కొందరు దళారీలను ఈపనికి వినియోగించారని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగానే చెబుతున్నారు. యాజమాన్యం 'ఇన్‌స్టంట్‌కోచింగ్' పేరిట వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది. ఈ కోచింగ్ కోసం విద్యార్థుల వద్ద నుంచి వసూలు చేసే మొత్తాన్ని లెక్చరర్లు, కొంత మంది సిబ్బంది పంచుకొంటున్నారు. యాజమాన్యం కళాశాల పరిస్థితులు చక్కదిద్దకుండా చూస్తు ఊరుకోవడం వల్ల వీరిపై కూడా విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కళాశాల రెక్టార్‌కు ఈ విషయాలన్నీ తెలియవా... లేక ఎవరైనా తప్పుత్రోవ పట్టిస్తున్నారా?

## సీట్లు కూడా అమ్ముకొంటున్నారు

## విద్యానగర్‌లో అంతర్ కళాశాలల క్రీడోత్సవాలు

వెంకటేశ్వర యూనివర్శిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కాలేజీల మధ్య క్రీడల పోటీలు 13, 14 తేదీల్లో విద్యానగర్ ఎన్.బి.కె.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీలో జరిగాయి. పోటీలను ఎన్.బి.కె.ఆర్. విద్యా సంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి పద్మనాభరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి. గోపాలరెడ్డి ప్రారంభించారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, టెన్నిస్ పోటీల్లో నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన 25 కళాశాలల జట్లు పాల్గొన్నాయి. వాలీబాల్‌లో పుంగనూరు ఎస్.ఆర్. గవర్నమెంట్ కళాశాల జట్టు, నెల్లూరు వి.ఆర్. కళాశాల జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందాయి. బాస్కెట్‌బాల్‌లో కడప వై.ఎస్.ఆర్.ఎం. డిగ్రీ కాలేజి జట్టు, కడప కె.ఎస్.ఆర్.ఎం. కాలేజి జట్టు వరుస స్థానాల్లో నిలిచాయి. హ్యాండ్‌బాల్‌లో నెల్లూరు వి.ఆర్. కళాశాల జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు డాక్టర్ బి. గోపాలరెడ్డి బహుమతి ప్రదానం చేశారు. చక్కని ఏర్పాట్లు చేసిన కళాశాల యాజమాన్యాన్ని యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ డి. జయకుమార్ అభినందించారు.

# ఆత్మకూరుకు మురికి శాపం!

ఆత్మకూరులో పారిశుధ్య పరిస్థితులు నానాటికీ దిగజారి పోతున్నాయి. మురికి, కూపంగా మారిపోతుంది. గ్రామంలో డ్రైయిన్ కాలువలు దరిద్రంగా వున్నాయి. ఎత్తుపల్లాలుగా కట్టడంతో మురుగు నీరు మధ్య మధ్యలో పొంగి మురుగు నీళ్లన్నీ రోడ్లపైన ప్రవహిస్తున్నాయి. ఈ మురుగులో పగలు పందులు, రాత్రుళ్లు దోమలు శాశ్వత నివాసం ఏర్పరచుకొని ప్రజలను వ్యాధిగ్రస్తులను చేస్తున్నాయి. టౌన్ నడిబొడ్డున వెళ్లే పంట కాల్వల్లో కూడా మురుగు నీరు చేరి అవీ దుర్వాసనను వెదజల్లుతున్నాయి. గ్రామంలో పంచాయతీ అనేక చోట్ల కొళాయిలను వేసింది. కాని వాటికి ప్లాట్‌ఫారాలు నిర్మించక పోవడం వల్ల, బురద మడుగులు తయారవుతున్నాయి. జగన్నాధరావు పేట ప్రాంతంలో కోనేరు దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. ప్రజలు పారవేసిన చెత్త చెదారాలను ఏ రోజు కారోజు పంచాయతీ తొలగించడం లేదు. దీనివల్ల గ్రామంలోని ప్రధాన వీధులన్నీ చెత్తతో నిండి ఉంటున్నాయి. సిబ్బంది తగినంత మంది లేకపోవడం వల్ల తామేమీ చేయలేక పోతున్నామన్న పంచాయతీ అధికారుల వివరణను ప్రజలు విమర్శిస్తున్నారు. ఉన్న సిబ్బంది చేత రోజూ కొన్ని ప్రాంతాలు శుభ్రపరిచేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లావార్తలు

## వెంకటగిరి పోలేరమ్మ జాతర

వెంకటగిరి పోలేరమ్మ జాతర 24, 25 తేదీల్లో జరుగుతుంది. 24 తేది పోలేరమ్మ విగ్రహాన్ని తయారుచేసి జీనిగల వారి వీధిలో ప్రతిష్టింప చేస్తారు. అదే రోజు రాత్రి జాతర సందడి; 25 తేదీ సాయంత్రం విగ్రహాన్ని కైవల్యానదిలో నిమజ్జనం చేస్తారు. జంతు బలులు, మద్యాన్ని ప్రభుత్వం నిషేధించినా, అవి రెండూ లేకుండా జాతరే జరగదు. ఇంతకు మునుపు జాతర బరువు బాధ్యతలన్నీ వెంకటగిరి రాజాలు చూసేవారు. ఈ అధికారాన్ని దేవదాయ శాఖకు అప్పజెప్పడంతో జాతర జోరు తగ్గిపోయిందనాలి.

## జన్మభూమి కార్యక్రమంపై వివిధ పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాలపై వివిధ పోటీలు నిర్వహిస్తూంది. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పాటలు పాడడంపై మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు పెడుతున్నారు. మండల స్థాయిలో సెప్టెంబర్ 29 తేది; అక్కడ విజేతలైన వారికి అక్టోబర్ 8 తేది జిల్లా స్థాయిలో ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు పొందిన వారిని అక్టోబర్ 10 తేది రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని జిల్లా యువజన సంక్షేమాధికారి జె.యు.కె. ప్రసాద్ తెలియజేస్తున్నారు. సి.ఎం.ఇ.వై. డ్వాక్రా గ్రూపులు, వన సంరక్షణ, సాగునీటి సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు ఈ అవకాశాన్ని వినియోగించుకో మంటున్నారు.

## జోకులపోటీ

సూళ్లూరుపేటలోని పునర్వాప్ సంస్థ జిల్లా స్థాయిలో జోకుల పోటీ

కొరవ 8 పేజీలో

# గూడూరు చక్రవడ్డీల దగా!

గూడూరులోని కుదువ వ్యాపారస్తులు అధిక వడ్డీలు వసూలుచేసి ప్రజలను మోసగిస్తున్నారు. వస్తువులను తనఖా పెట్టుకొనే సమయంలో నెల వడ్డీ ముందుగా పట్టుకొనే వ్యాపారస్తులు; సంవత్సరం తరువాత తాకట్టు విడిపించుకొనే సమయంలో అసలులోకి వడ్డీకి వడ్డీ కలిపితీసుకొంటున్నారు. తాకట్టుపెట్టిన తేదీ నుండి 3 1/2 సంవత్సరం లోపు వస్తువు విడిపించు కోవచ్చు. చట్టప్రకారం గడువు అయిపోయిన విషయాన్ని వస్తువు స్వంతదారునికి తెలియజేయాలి. కాని గూడూరు వడ్డీ వ్యాపారస్తులు ఒక్క సంవత్సరం కూడా గడవక ముందే చెప్పాపెట్టకుండా అమ్మేస్తున్నారు. పైగా అమ్మివేసే అధికారం తమకు వుందని దబాయిస్తున్నారు. ఇక్కడి వడ్డీ వ్యాపారస్తులు దీని కోసం ప్రత్యేకంగా ఒక యాక్టును రూపొందించుకొన్నారట.

ప్రజలను నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్న వడ్డీ వ్యాపారస్తులను ఇన్‌కంటాక్స్ అధికారులు చూసి చూడనట్లు వదిలివేయడం అన్యాయం.








# శ్రద్ధాంజలి

మాకు కొండంత అండ, రాముడికి లక్ష్మణుడు మాదిరి నవెప్పుడు అంటి పెట్టుకొని వుండి, జిల్లా రాజకీయ నాయకులందరితో ఎంతో సఖ్యంగా వుంటూ, మా అభివృద్ధికి నిత్యం శ్రమించిన మా తమ్ముడు



# ఆల్తూరు సురేంద్ర రెడ్డి గారు

4.9.97 తేది గురువారం మమ్మెంతో దుఃఖ సాగరమున ముంచి అకస్మాత్తుగా స్వర్గస్తులైనందుకు చింతిస్తున్నాము. వారులేని లోటు మాకెవ్వరూ తీర్చలేనిది. వారి ఆత్మకు భగవంతుని సన్నిధిలో చిరశాంతి కలగాలని ప్రార్థిస్తున్నాము.

## ఉత్తరక్రియలు

| | | |
|---|---|---|
| 24.9.97 తేది | బుధవారం | శిలాప్రతిష్ఠ |
| 25.9.97 తేది | గురువారం | శిలోద్వాసన ( ఎత్తురేవు ) |

నెల్లూరు, దర్గామిట్ట, న్యూమిలిటరీ కాలనీ ఎక్స్టెంటన్ (25-II / 395) వేదాయపాళెం, 5th టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గరలోని మా స్వగృహమున జరుగును.

బంధుమిత్రులు తెలియగోరుతాము.

... ఆల్తూరు ఆదినారాయణరెడ్డి - అన్న

| | |
|---|---|
| ఆల్తూరు సులోచనమ్మ – వదినె | ఆల్తూరు శేషమ్మ – అమ్మ |
| రామసుబ్బారెడ్డి – సుశీలమ్మ | చిన్నాయన – చినమ్మ |
| గిరీష్ కుమార్ రెడ్డి – లత. | |
| మహేష్ కుమార్ రెడ్డి – రాధిక | అన్న కుమారులు – కోడళ్లు |
| సాహిని – సాయిూష్ | మనుమరాలు, మనుమడు |